www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING
CURE - PURE - RARE

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:76 WEDNESDAY ,JULY 29,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 76 బుధవారం 29 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-






## శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ..

### 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విన్నపం

**గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం**

**గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం**

హంసకలం వార్త : ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని మిగతా2లో

## హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు..

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం** 2

**ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ**


## తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు



హంసకలం వార్త : తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని మిగతా2లో

# బోర్డు ఇంటర్ నేషనల్ - సిలబస్ స్టేట్

**సీ బీ ఎస్ సి సిలబస్ అంటూ తల్లి దండ్రులకి మాయ మాటలు**




- అపార్ట్ మెంట్‌లో నిర్వహిస్తున్న స్కూలు ఇంటర్ నేషనల్ స్కూల్ అవుతుందా?
- కెంబ్రిడ్జ్ బుక్స్ అంటు మోసం
- లక్షల్లో ఫీజులు వసూల్లు
- చోద్యం చూస్తున్న విద్యా శాఖ

## సీబీఎస్ఈ సిలబస్ అంటూ తల్లి దండ్రులకి మాయ మాటలు

**అపార్ట్ మెంట్లో నిర్వహిస్తున్న స్కూలు ఇంటర్నేషనల్ స్కూల్ అవుతుందా?**

**' కేంబ్రిడ్జ్ బుక్స్ అంటు మోసం**

**' లక్షల్లో ఫీజులు వసూల్లు**

**' చోద్యం చూస్తున్న విద్యా శాఖ**

హంసకలం వార్త

ఇంటర్నేషనల్ స్యూల్స్ పేరుతో అందమైన బ్రోచర్లు తీసి విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న రంగారెడ్డి జిల్లా లో అక్రమ పాఠశాలలపై ధర్మఘంట ప్రత్యేక కథనాలు త్వరలో








## బీఆర్ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

హంసకలం వార్త : బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మిగతా2లో



## తాడిచర్ల-2 ప్రాజెక్టును వేగవంతం చేయండి..

**● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో తెలంగాణ మంత్రి వివేక్, ఎంపీ వంశీ భేటీ ● తాడిచర్ల-2 కోల్ బ్లాక్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ ● స్థానిక యువతకు 1000 ఉద్యోగాలు కల్పించాలని వినతి** 2

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం..




హంసకలం వార్త : గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన మిగతా2లో

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే



2

**తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు**

**చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి**

**సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య**

తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ..

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్' (PMAY-G) 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ (VB-G RAM-G) జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

# హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు..



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా? ఒక బీఆర్‌ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు?

తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంపై బుల్లితెర రంగానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు డబుల్ 420 అని అభివర్ణించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఇబ్బంది రానివ్వమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు చెబుతున్నారని తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారని చెప్పారు. అయితే హైడ్రా విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పాల్సింది కోర్టుకు చెబుతామని అన్నారు. రాజకీయం కోసమే హైడ్రాకు వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకి వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని గుర్తు చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందంటూ బీఆర్ఎస్ పార్టీపై మంత్రి శ్రీధర్ బాబు నిప్పులు చెరిగారు.

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# తాడిచర్ల-2 ప్రాజెక్టును వేగవంతం చేయండి..

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తెలంగాణ కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి సోమవారం ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో భేటీ అయ్యారు. తాడిచర్ల-2 కోల్ బ్లాక్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని, అదే సమయంలో స్థానిక ప్రజలకు, సింగరేణి కార్మికులకు గరిష్ఠ ప్రయోజనాలు చేకూరేలా చూడాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రాజెక్టులో స్థానిక యువతకు, ముఖ్యంగా ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ప్రాధాన్యతనిస్తూ కనీసం 1,000 ఉద్యోగాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. నిర్వాసిత కుటుంబాలకు సమగ్ర పునరావాస (R&R) సౌకర్యాలు కల్పించాలని, సింగరేణి రిటైర్డ్ కార్మికుల కనీస నెలవారీ పెన్షన్‌ను రూ.10,000కు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) విస్తరణకు, కొత్త బొగ్గు గనుల అభివృద్ధికి మరియు గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన తోడ్పాటును అందించాలని కోరారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి కేటాయించిన విషయం తెలిసిందే. తెలంగాణ నేతల ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇదే పర్యటనలో భాగంగా వారు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయను కూడా కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం.. రోడ్లన్నీ జలమయం

గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ , జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

## జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా: మంత్రి దామోదర రాజనర్సింహ

జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా కల్పించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ సచివాలయంలో జగిత్యాల జిల్లా వైద్య సేవలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని (జీజీహెచ్) అన్ని స్పెషాలిటీ వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక వసతులతో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జగిత్యాల మెడికల్ కాలేజీలో అన్ని పీజీ కోర్సులకు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు త్వరలోనే స్పెషలిస్ట్ వైద్యులను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టుల్లో ఇప్పటికే 1,182 నియామకాలు పూర్తయ్యాయని, గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాలలో త్వరలో క్రిటికల్ కేర్ బ్లాక్‌తో పాటు ట్రామా కేర్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్ ద్వారా జిల్లా ఆస్పత్రులకు నిరంతర ఔషధాల సరఫరా జరుగుతోందని, సిజేరియన్ డెలివరీలు తగ్గించి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించేందుకు నర్సులకు మిడ్‌వైఫరీ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. జగిత్యాల జీజీహెచ్‌ను స్పెషాలిటీ హబ్‌గా, కరీంనగర్‌ను సూపర్ స్పెషాలిటీ హబ్‌గా అభివృద్ధి చేస్తూ, సబ్ సెంటర్ల నుంచి జిల్లా ఆస్పత్రుల వరకు ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


# సంపాదకీయం

## ‘ఎమర్జెన్సీ’ని ముందే చెప్పిన ‘కాలజ్ఞాని’

భారత విప్లవోద్యమ సారథుల్లో అగ్రగణ్యుడైన తరిమెల నాగిరెడ్డి మరణించి నేటికి అర్ధశతాబ్ది. అజ్ఞాతం అనంతరం ‘మాదిరెడ్డి వెంకట్రామయ్య’ అనే మారుపేరుతో 1976 జూలై 28న ఉస్మానియా ఆసుపత్రిలో చేరి, పరిస్థితి విషమించడంతో ఆయన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ యాభై ఏళ్ల కాలంలో ఆయన వ్యక్తిత్వాన్ని, విప్లవోద్యమంలో ఆయన పాత్రను శ్లాఘిస్తూ వందలాది వ్యాసాలు, పుస్తకాలు వచ్చాయి. నాగిరెడ్డి ఇంటిపేరు ‘తరిమెల’ కాదు, ‘కంచిరెడ్డి’. వారి స్వంత గ్రామం తరిమెల కనుక నాగిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి కాలం నుంచి ‘తరిమెల’గా పిలిచేవారు. ఆ తర్వాత కాలం నుంచీ వారి కుటుంబంలోనూ, వారి కజిన్స్ కుటుంబాల వారిని కూడా ‘తరిమెల’ ఇంటిపేరుతో పిలవటంతో అదే స్థిరపడింది. ఆసక్తి కల్గించే మరో విషయం నీలం సంజీవరెడ్డితో నాగిరెడ్డి బంధుత్వం. నాగిరెడ్డి పెద్ద చెల్లెలు నాగరత్నమ్మతో సంజీవరెడ్డి పెళ్లి జరగ్గా, సంజీవరెడ్డి చెల్లెలు లక్ష్మీకాంతమ్మను నాగిరెడ్డి వివాహమాడారు. వీరిద్దరినీ ‘కృష్ణార్జునులు’గా చిత్రిస్తూ రాసిన ఒక పద్య నాటకం 1955 మధ్యంతర ఎన్నికల సందర్భంగా రాష్ట్రమంతా ప్రదర్శించారు. దాని రూపకర్త ఎవరో తెలియదు కానీ, ఆ మధ్య కృష్ణా జిల్లా పెదకళ్లేపల్లి వెళ్లినప్పుడు గొర్రెపాటి పార్థసారథి రెండు అసంపూర్ణ పద్యాలు చెప్పగా రాసుకున్నాను. వీరిద్దరి సంబంధం కంటే పూర్వమే సుబ్బారెడ్డి సోదరి చిన సుబ్బమ్మను నీలం చిన్నపరెడ్డికి ఇచ్చారు. వీరి పెద్ద కుమారుడే నీలం సంజీవరెడ్డి. ఆ తరంలో సుబ్బారెడ్డి, చిన్నపరెడ్డిలను ‘కృష్ణార్జునులు’గానే పిలిచేవారు. వీరిద్దరూ కలిసి స్వాతంత్ర్య ఉద్యమకారులుగా ఉంటూ మద్యపాన వ్యతిరేక ఉద్యమాన్ని ఆ ప్రాంతంలో గొప్పగా నిర్వహించారు. చిన్నపరెడ్డి అకాల మరణం వల్ల వారి కుటుంబ వ్యవహారాలు కూడా సుబ్బారెడ్డే చూశారు. ఇక, నాగిరెడ్డి--సంజీవ రెడ్డిల మధ్య ఎన్నికల పోరులో సంజీవరెడ్డి సోదరులు నీలం రాజశేఖరరెడ్డి, నీలం ప్రభాకరరెడ్డి... నాగిరెడ్డి పక్షమే వహించారు. 1952 ప్రథమ ఎన్నికల్లో జైల్లో ఉండి సంజీవరెడ్డిపై నాగిరెడ్డి పోటీపడగా, వారి భార్యలు వారి భర్తలకు అనుకూలంగా, సోదరులకు వ్యతిరేకంగా ప్రచారం చేయటం ఆ రోజుల్లో పెద్ద సంచలనం. చివరకు నాగిరెడ్డే విజయం సాధించారు. తరిమెలలోని వీధిబడిలో, గండీ థియోసాఫికల్ హైస్కూల్‌లో, ఋషివ్యాలీ స్కూల్లో, మద్రాసు లయోలా కాలేజీలో చదువు ముగిసిన తర్వాత నాగిరెడ్డికి కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో చదవాలని కోరిక కలిగింది. సుబ్బారెడ్డికి ఇష్టం లేకపోయినా రాయలసీమ ప్రముఖ కాంగ్రెసు నాయకులు కల్లూరి సుబ్బారావుతో కలిపి నాగిరెడ్డిని, నీలం రాజశేఖరరెడ్డిని బనారస్ (కాశీ) పంపించారు. అప్పటికే గాంధీ ప్రభావంతో ఉన్న నాగిరెడ్డి కోర్కెపై వీరు ముగ్గురూ వార్ధా ఆశ్రమానికి వెళ్లి గాంధీని దర్శించుకున్నారు. వీరిని భోజనం చేయమని గాంధీ ఆహ్వానించగా నాగిరెడ్డి, రాజశేఖరరెడ్డి ఉత్సాహపడ్డారు. కానీ కల్లూరి సుబ్బారావు ‘బయట తింటాం’ అని చెప్పి వీరిని తీసుకెళ్లాడు. ఇక్కడ ఉప్పూ కారం లేని చప్పిడి భోజనం పెడతారు, మనం తినలేం అని చెప్పారట. నాగిరెడ్డికి గాంధీజీ ఒక చరఖా బహూకరించారు. ఆ చరఖాతో సహా బెనారస్ విశ్వవిద్యాలయానికి చేరిన నాగిరెడ్డి కొద్దికాలంలోనే గాంధీయిజంపై భ్రమలు కోల్పోయి కమ్యూనిస్టు ప్రభావంలోకి వెళ్లారు. సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనే శక్తి కమ్యూనిజానికే ఉందనే నమ్మకంతో 1939లో పార్టీ సభ్యత్వం స్వీకరించారు. నాగిరెడ్డిని ప్రభావితం చేయటంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు భరద్వాజ కృషి చేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా కూడా నాగిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ పదవికి ఎన్నికైన తొలి దక్షిణ భారతీయుడు ఆయన. అప్పుడు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. నాగిరెడ్డి జీవిత చరిత్ర రాయాలనే ఉద్దేశంతో 1981లో ఒకసారి తరిమెల వెళ్లి కృష్ణారెడ్డి ఇంటి అటకపై ఉన్న పాత ఉత్తరాల్ని దించాం. ఉద్యమానికి ఆటంకాలు కలుగజేస్తూ, అజ్ఞాతంలో ఉన్న తనను పట్టించటానికి కాపలా మనుషుల్ని నియమించి, పార్టీ కార్యకర్తలపై అనేక తప్పుడు కేసులు బనాయించినందుకుగానూ--‘నిన్ను చంపేస్తాం’ అంటూ తండ్రి సుబ్బారెడ్డిని బెదిరిస్తూ కుమారుడు నాగిరెడ్డి రాసిన ఉత్తరం వాటిలో ఒకటి. ‘చాలా రోజులు పట్టించుకోలేదు, ఇక ఈ నిర్ణయం అనివార్యమనీ, తల్లికి నచ్చజెప్పమనీ తమ్ముడు కృష్ణారెడ్డికి రాసిన ఉత్తరం, పెళ్లికాక ముందు సంజీవరెడ్డి జైలు నుంచి నాగరత్నమ్మకి రాసిన ప్రేమలేఖ తదితరాలు దొరికాయి. నాగిరెడ్డి లేఖ రాసిన తర్వాత సుబ్బారెడ్డి బండి ప్రయాణం మాని జీపు తెచ్చుకున్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రి కుమార స్వామిరాజా, మద్య నిషేధ శాఖా మంత్రి సంజీవరెడ్డి తరిమెలకు వచ్చి సభపెట్టి, తన మామకు ఏమైనా జరిగితే తరిమెలలో కమ్యూనిస్టుల్ని కాల్చి చంపి, వారి ఇళ్లన్నీ నేలమట్టం చేస్తామని హెచ్చరించి, గ్రామంలో పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. సుబ్బారెడ్డి కొన్ని మంచి పనులు (సారా వ్యతిరేకత, హరిజనుల గుడి ప్రవేశం తదితరాలు) చేశాడు. అతణ్ని చంపితే ప్రజలందరూ హర్షించరని, పార్టీలోనే కొందరు అభిప్రాయపడటంతో మొత్తంమీద నాగిరెడ్డి నిర్ణయం అమలు కాలేదు. అయినా తండ్రి దుర్మార్గాలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంతో ప్రజల్లో నాగిరెడ్డి గొప్ప నాయకునిగా స్థిరపడ్డారు.ఎనాకు విచిత్రమనిపించిన విషయం ఒకటుంది. 1975 జూన్ 23న తాడిపత్రిలోనూ, జూన్ 25 సాయంత్రం అనంతపురం ఓల్డ్‌టౌన్‌లోనూ నిర్వహించిన బహిరంగ సభల్లో ‘త్వరలో దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించబోతున్నార’ని నాగిరెడ్డి హెచ్చరించారు. (జిల్లాలోని రైతు నాయకులంతా కలిసి నాగిరెడ్డిని, సంజీవరెడ్డిని 3 దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై ప్రసంగించేట్లు అంగీకరింపజేసి తాడిపత్రి సభ పెట్టారు) ఆయన చెప్పినట్లే జూన్ 25న రాత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించారు. నాగిరెడ్డి కాలజ్ఞాని అనుకోవటం తప్పు, ఇదెలా సంభవమో తెలియదు. రాజకీయ పరిస్థితిని ఇంత కచ్చితత్వంతో అంచనా వేయగల నాయకుణ్ని 59 సంవత్సరాల వయస్సులో కోల్పోవటం కమ్యూనిస్టు ఉద్యమానికి ఎనలేని లోటు.

# జమ్మూ--కశ్మీర్‌లో వాగ్దాన వంచన









జమ్మూ--కశ్మీర్‌కు రాష్ట్ర హోదా నిరుడు కురిసిన హిమసమూహమేనా? భారత రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేసి, జమ్మూ--కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చివేసిన చరిత్రకు 5 ఆగస్టు 2026న ఏడు సంవత్సరాలు పూర్తవుతాయి. రానున్న ఈ ఏడవ వార్షికం సందర్భంగా జమ్మూ--కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించేందుకు ఆ కేంద్ర పాలిత ప్రాంత అధికార పక్షం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఈ నెల 20న న్యూఢిల్లీలో ఒక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎన్‌సీకి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (కశ్మీర్ లోయలో ప్రభావ ప్రాబల్యాలు ఉన్న పార్టీ) నుంచి తోడ్పాటు లభించలేదు. ‘ఇండియా’ కూటమి భాగస్వామ్య పక్షాలు ఎన్‌సీ నిరసన పట్ల ఉదాసీనత చూపాయి. అసలు ఈ జూలై 20న న్యూఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించడమే వివేకవంతమైన నిర్ణయం కాదు. ఎందుకంటే అదే రోజున కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు విద్యార్థులు, యువజనులు ఢిల్లీ వీధులలో పోటెత్తారు. పోలీసులు వారి పట్ల పాశవికంగా ప్రవర్తించారు. ఆ రోజు మీడియా దృష్టి అంతా ఈ నిరసన ప్రదర్శన, పోలీసులు దానిని అణచివేసిన తీరుపైనే కేంద్రీకృతమై ఉన్నది. జూలై 20 నిరసనతో జమ్మూ--కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ మళ్లీ ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమవుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ ఆశించింది. అయితే ఆ నిరసన ప్రభావ శూన్యంగా మిగిలిపోయింది. అయినప్పటికీ ఆ అపరిష్కృత డిమాండ్ దేశం ముందు ఒక అతి ముఖ్యమైన ప్రశ్నగా ఉన్నది. భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించి వేయడమనేది ప్రప్రథమంగా జమ్మూ--కశ్మీర్ విషయంలోనే జరిగింది. ఆగస్టు 5, 2019న ఇది సంభవించినప్పుడు కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను సాధ్యమైనంత త్వరలో పునరుద్ధరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మాటను అందరూ విశ్వసించారు. అయితే ఏడు సంవత్సరాలు గడిచినా ఆ వాగ్దానం ఒక మాటగా మాత్రమే మిగిలిపోయింది. ఈ దురదృష్టకర పరిణామం ఆ ప్రాంత ప్రజలకే కాకుండా ప్రజాస్వామికవాదులైన సమస్త భారతీయులకూ దిగ్భ్రాంతి, వ్యాకులత కలిగిస్తోందనడంలో సందేహం లేదు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయమై కేంద్ర ప్రభుత్వ వాగ్దానాల వివరాలను ఏప్రిల్ 2024లో కశ్మీర్ టైమ్స్ అనే స్వతంత్ర వెబ్‌సైట్ ప్రచురించింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేసిన రెండు నెలలకు (అక్టోబర్ 2019లో) కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతూ, ‘సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని’ చెప్పారు. అదే ఏడాది డిసెంబర్‌లో రామ్ మాధవ్ (ఆనాడు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి) కశ్మీర్‌కు ‘త్వరలోనే’ రాష్ట్ర హోదా పునరుద్ధరణ అవుతుందని ఉద్ఘాటించారు. ఫిబ్రవరి 2021లో ‘కశ్మీర్‌కు తగిన తరుణంలో పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. అక్టోబర్ 2021లో కశ్మీర్‌ను సందర్శించిన అమిత్‌షా ‘రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి నిస్తామని ఉద్ఘాటించారు. జనవరి 2022లో అమిత్‌షా ఇలా చెప్పారు: ‘నియోజకవర్గాల పునర్విభజన ప్రారంభమయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కశ్మీర్‌లో పరిస్థితులు యథాస్థితికి వచ్చిన వెంటనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని లోక్‌సభకు హామీ ఇచ్చాను.’ పదమూడు నెలల అనంతరం ప్రభుత్వ అనుకూల టీవీ చానెల్ నొకదానికి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ‘అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని స్పష్టంగా చెప్పాను’ అని అమిత్‌షా అన్నారు. 2022లో జమ్మూ--కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. జమ్మూ ప్రాంతంలో ఆరు కొత్త నియోజకవర్గాలు ఏర్పడగా కశ్మీర్ లోయలో ఒకటి మాత్రమే అదనంగా ఏర్పడింది. 2024 సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు నెలల ముందే ఉధాంపూర్--దోడాలో ఆ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల అనంతరం కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో ప్రత్యర్థి పక్షాల ఓట్లు చీలిపోయి తమకు లబ్ధి చేకూరుతుందని మోదీ, అమిత్‌షాలు విశ్వసించారన్నది స్పష్టం. అయితే వారి విశ్వాసం వమ్మయింది. ఇండియా కూటమి గెలుపును అడ్డుకోవడంలో వారి వ్యూహాలు విఫలమయ్యాయి. మొత్తం 90 నియోజకవర్గాలలో 49 ఇండియా కూటమికి దక్కాయి. వీటిలో 42 నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచిన స్థానాలు. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తీర్పును గౌరవించేందుకైనా కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై చిత్తశుద్ధి చూపారా? లేదు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా తప్పక ఇస్తామని మార్చి 2025లో అమిత్‌షా న్యూఢిల్లీలో అన్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో కూడా ‘తగిన సమయం’లో కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ఆయన చెప్పారు. ఈ హామీలలో ఏ ఒక్కదానినీ నెరవేర్చలేదని మరి చెప్పనవసరం లేదు. ఆ వాగ్దానాలలోని భాషను నిశితంగా పరిశీలించండి. ఉద్దేశపూర్వకంగానే అది అస్పష్టంగా, సందిగ్ధంగా ఉన్నట్టు అర్థమవుతుంది. ‘సాధారణ పరిస్థితులు’, ‘త్వరలో’, ‘సరైన సమయంలో’, ‘తగిన తరుణంలో’-- వీటిల్లో ఏ ఒక్కటైనా ఎట్టకేలకు ఆసన్నమయిందని ఎవరైనా ఎలా నిర్ణయించగలరు? కశ్మీర్‌కు న్యాయబద్ధమైన పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణను జాప్యం చేసేందుకే పాలకులు ఇలా మాట్లాడుతున్నారనేది స్పష్టం. 2019 ఆగస్టు నుంచీ జమ్మూ--కశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులను న్యూఢిల్లీ పాలకులు పూర్తిగా అలక్ష్యం చేస్తున్నారు. ఈ జూలై తొలి రోజుల్లో అనంతనాగ్‌లో ఉగ్రవాద దాడిలో పోలీస్ కానిస్టేబుల్ ఒకరు చనిపోయారు. ఆ ఘటనకు బాధ్యులు అనే ఆరోపణతో 2500 మందిని అరెస్ట్ చేశారు! కశ్మీర్‌లో ప్రజాస్వామిక హక్కులపై మోదీ ప్రభుత్వానికి ఇసుమంత గౌరవం కూడా లేదనడానికి ఇంతకంటే మరో తార్కాణమేముంటుంది? ఒక వ్యక్తి దుర్మరణానికి ఇన్ని వేల మందిని నిందితులుగా పరిగణించడం న్యాయమేనా? ఇంతమంది పౌరులను ఒక వ్యక్తి హత్య కేసులో అనుమానించడానికి.. భారత రాజ్యాంగానికి ఏ వ్యాఖ్యానం సమ్మతిస్తుంది? రాజ్యాంగపరమైన ఈ ప్రశ్నకు సమాధానం లభించదు. ఎందుకంటే అది స్పష్టంగా పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, సందేహం లేదు. 2024 అసెంబ్లీ ఎన్నికలలో 64శాతం మంది ఓటర్లు తమ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకున్నారు. కశ్మీర్‌లో ఇది రికార్డు స్థాయి పోలింగ్. జమ్మూ--కశ్మీర్ ప్రజలు బహుళ--పార్టీ ప్రజాస్వామ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నారని, కనుకనే మున్నెన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారని స్పష్టమవుతుంది. నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తోంది. అయినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ ప్రజా తీర్పును ధిక్కరిస్తోంది, అపహసిస్తోంది. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు తిరస్కరిస్తోంది. 1950--2019 సంవత్సరాల మధ్య జమ్మూ--కశ్మీర్ భారత గణతంత్ర రాజ్యంలో ఒక పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నది. అదేకాలంలో భారత్‌లో అంతర్భాగాలుగా ఉన్న తొమ్మిది హిమాలయ ప్రాంతాలు రాష్ట్ర ప్రతిపత్తిని సాధించుకున్నాయి. అప్పటివరకు ఆ ప్రాంతాలకు రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించడమనేది ఆచరణీయం కాని విషయంగా భావించేవారు. ఆ రాష్ట్రాలు: అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయ, సిక్కిం, త్రిపుర, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్. గమనార్హమైన విషయమేమిటంటే ఈ తొమ్మిది రాష్ట్రాలలోను జమ్మూ--కశ్మీర్‌లో కంటే తక్కువ జనాభా ఉన్నది. నిజానికి పలు హిమాలయ రాష్ట్రాలలో చాలా చాలా తక్కువ జనాభా మాత్రమే ఉన్నది. అయినా ఆ ప్రాంతాలన్నీ రాష్ట్ర ప్రతిపత్తిని పొందాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన వాటి ప్రభుత్వాలు నిజమైన అధికారాలు చలాయిస్తున్నాయి. మరి జమ్మూ--కశ్మీర్‌లో ఆగస్టు 2019 నుంచి ప్రజాస్వామికంగా ఎన్నికవ్వని లెఫ్టినెంట్ గవర్నర్ ఒక వైస్రాయిలా పరిపాలిస్తున్నాడు. న్యూఢిల్లీ పాలకులకు విధేయంగా వ్యవహరిస్తున్నాడు. ఇదేమి ప్రజాస్వామ్యం? కశ్మీర్ ప్రజలు నిజమైన ప్రజాస్వామ్యానికి అర్హులు. మరి వారెందుకు వివక్షకు గురవుతున్నారు? ఈ ప్రశ్నకు సమాధానమివ్వడం కష్టమేమీ కాదు. ఆ ఎనిమిది హిమాలయ రాష్ట్రాలు ఏ ఒక్క దానిలోనూ ముస్లింలు మెజారిటీగా లేరు. జమ్మూ--కశ్మీర్‌లో మాత్రమే ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రి ఔదలదాల్చిన హిందుత్వ భావజాలం ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మాత్రమే పరిగణిస్తున్నది. ఈ మతమైనారిటీలు అధిక సంఖ్యాకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాల్సిందేనని నిర్దేశిస్తున్నది. భారత గణతంత్ర రాజ్య పూర్తిస్థాయి పౌరులుగా వారిని ఎంచదు, గౌరవించదు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణను కేంద్రం నిరాకరిస్తూనే ఉన్నది. ఒక సహేతుకమైన డిమాండ్‌ను అదే పనిగా తిరస్కరించడం జాతి శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఆ తిరస్కరణ హానికరమైన మెజారిటీవాద పాలనా విధానాలను బలపరుస్తూ భారత రిపబ్లిక్ సమైక్యత, సమగ్రతకు ఆటంకమవుతోంది.

# తెలంగాణ సాధనలో జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం -- బండి రమేష్

( జూలై - 28- హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బాలానగర్ వెంకటేశ్వర్ నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో తనదైన శైలిలో బలంగా గళం విప్పారని అన్నారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన నిజమైన ప్రజానాయకుడని కొనియాడారు. రాజకీయ చతురుడిగా, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన జైపాల్ రెడ్డి ఎలాంటి క్లిష్ట సమస్య వచ్చినా చాకచక్యంగా




పరిష్కార మార్గాన్ని చూపే నాయకుడని పేర్కొన్నారు. తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో బలంగా వినిపించడంలో, రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమైందని బండి రమేష్ గుర్తు చేశారు. ఆయన ప్రజాసేవ, రాజకీయ విలువలు, నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము సంతోష్, పులి శివగౌడ్, చంద్ర, నాగార్జున, క్రాంతి, నర్సింగ్, రాము, రమణ, జ్యోతి, శ్రీనివాస్, పార్వతి, ముస్తఫా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్ రెడ్డి కి ఘనంగా నివాళులర్పించారు.

# మంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ని కలిసి







( జూలై - 28- హంస కలంవార్త )

కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ లోని 18 నెంబర్ సర్వేలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉర్దూ మరియు తెలుగు మీడియం స్కూల్స్.. అలాగే కమిటీ హాల్ ,బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని ..అలాగే ఆ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి రక్షించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.. త్వరలోనే నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.. అలాగే కూకట్ పల్లి నియోజకవర్గం లోని నిర్మించిన కైతలపూర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో స్థానికులకు మాత్రమే ఇల్లు కేటాయించే విధంగా చూడాలని.. ఎక్కడెక్కడ నుంచో వచ్చి మంత్రులు, ప్రభుత్వ అధికారులు అనుచరులకు రికమండేషన్ ద్వారా ఈ ప్రాంతంలో ఇల్లు కేటాయించడం పద్ధతి కాదని ..ఈ విధంగా కేటాయిస్తే కూకట్ పల్లి నియోజకవర్గం లో నిరుపేదలు కు అన్యాయం జరుగుతుందని.. దీనిపై ఎవరికైతే కేటాయించారో వారిని వెనక్కి తీసుకుని పారదర్శకంగా నిరుపేదలుకు కేటాయించాలని అలాగే ఇలా స్థానికేతరులకు కేటాయించడంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కలెక్టర్కు వినతి పత్రం అందించారు ..దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాలు బాబురావు, సబియా గౌసిద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసిద్దీన్, సత్యం, వీరారెడ్డి, చాంద్, జావిద్, సంజీవ, జ్ఞానేశ్వర్, శ్యాంసుందర్ రెడ్డి, సంజీవరెడ్డి, జుబేద్, రాము తదితర బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశంపై వెల్లువెత్తిన సంబరాలు....

**-తమకు నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానా అనే విధంగా హైడ్రా వ్యవహరించింది : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ...**

( జూలై - 28- హంస కలంవార్త )



పేదల పక్షాన బిఆర్ఎస్ చేసిన పోరాటానికి ప్రతిఫలమే ఈ ఫలితం. సిట్టింగ్ హై కోర్ట్ జడ్జితో హైడ్రా ఆగడాలు, దోపిడీపై పై సత్వర విచారణ చేపట్టాలి : బిఆర్ఎస్ పార్టీ డిమాండ్... హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహార తీరుపై రాష్ట్ర హైకోర్ట్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మీడియ ముఖంగా హైడ్రా ద్వారా ప్రభుత్వం సాగించిన దురాక్రమ పాలన, హైడ్రా కమిషనర్ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయం ,అధర్మం పై ధర్మం సాధించిన విజయం. హై కోర్టు తీర్పు బీ ఆర్ ఎస్ పేదల పక్షాన సాగిస్తున్న పోరాటానికి వచ్చిన ప్రతిఫలం. రేవంత్ రెడ్డి హిట్లర్ పోకడలకు ఈ తీర్పు చెంప పెట్టు. ఏ వ్యవస్థలైన బాబా సాహెబ్ అంబెడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పని చేయాల్సిందే కానీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదని హైడ్రా కమిషనర్ ను తొలగించాలని ఇచ్చిన తీర్పు రుజువు చేసింది. రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ కిందే హైడ్రా పని చేస్తోంది. హై కోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖల మంత్రిగా కొనసాగే నైతిక అర్హతను కోల్పోయారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్టే రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలి. విపత్తుల సమయం లో ప్రజలకు అండగా ఉండాల్సిన హైడ్రా ప్రజలను విపత్తుల్లోకి నెడుతోంది. తమకు నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానా అనే విధానాన్ని అమలు చేయడానికి రేవంత్ రెడ్డి హైడ్రా ను దుర్వినియోగం చేస్తున్నారు. హైడ్రా తో ప్రజలకు జరిగిన మేలు గోరంత ..జరిగిన నష్టం కొండంత. హై కోర్టుకు సారీ చెప్పిన రంగనాథ్ తనను తొలగించాలని న్యాయస్థానం ఆదేశం ఇచ్చిన తర్వాత తన చర్యలని సమర్థించుకోవడం ఎంతవరకు సబబు ?న్యాయ వ్యవస్థను గౌరవిస్తారా లేదంటే ఓ వ్యక్తి దుర్మార్గాలను ప్రోత్సహిస్తారా రేవంత్ రెడ్డి తేల్చుకోవాలి. బుల్డోజర్ రాజ్ వైపా రూల్ బుక్ వైపా అనేది రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలి. హైడ్రా లాంటి వ్యవస్థ పేద,మధ్యతరగతి వర్గాల పాలిట హైడ్రోజన్ బాంబు లా మారింది. అందుకే మా అధినేత కేసీఆర్ బీ ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చిన వెంటనే హైడ్రా భూతాన్ని తరిమికొడతామని ,మొదటి నిర్ణయం ఇదే అవుతుందని జగిత్యాల సభలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. రంగనాథ్ పోయి ఇంకో రంగయ్య వచ్చినా రేవంత్ హిట్లర్ పోకడలు మానక పోతే హైడ్రా తీరు మారదు. చేసిన దుర్మర్గాలు చాలవన్నట్టు హైడ్రా కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. బిఆర్ఎస్ నేతల రక్తం తో పొలాలు పండించాలన్న రేవంత్ రెడ్డి హైడ్రా తో ప్రజల రక్త మాంసాలు కండ్ల జూస్తున్నారు. తనకు హిట్లర్ ఆదర్శమన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్ప ఈ దేశం లో ఎవరైనా ఉన్నారా? రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతూ నీతులు చెబుతారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న రేవంత్ రెడ్డి పై రాహుల్ గాంధీ మౌనం అనేక అనుమానాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్ ంవంత్ బ్లాక్ మెయిల్ కు రాహుల్ గాంధీ కూడా భాదితుడిగా మారి రాష్ట్రం లో రాక్షస పాలన నడుస్తున్నా దృతరాష్ట్రుడిలా మారిపోయారా ? రాహుల్ గాంధీ అధికారం లోకి వస్తే జెన్ జీ తరానికి విద్యాశాఖ మంత్రిగా భాద్యతలు అప్పగిస్తామని రేవంత్ చెప్పడం మిలీనియం జోక్. రాహుల్ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి మంత్రులను నియమిస్తాడా ? ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత అన్నట్టు ఉంది రేవంత్ వ్యవహారం. విద్యా శాఖ మంత్రిగా రేవంత్ విఫలమయ్యారు. జెన్ జీ మీద అంత ప్రేమ ఉంటే తన స్థానం లో 30 యేండ్ల లోపున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ను విద్యా శాఖ మంత్రిగా నియమించొచ్చు కదా. రోజుకో డ్రామా ,దినానికో డైవర్షన్ తో రేవంత్ రెడ్డి ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్నారు. ప్రజలకు రేవంత్ మాయ మాటలన్నీ అర్థమై పోయాయి ..ఇక మసిపూసి మారేడు కాయ చేస్తానంటే కుదిరే కాలం పోయింది. హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీర్పు తో రేవంత్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొమ్మిది తలల సర్పమని హై కోర్టు అంటే రేవంత్ రెడ్డి ని పది తలల రావణుడని ప్రజలు అంటున్నారు. రేవంత్ రావణ పాలన పోవడం ఖాయం కేసీఆర్ రాముడి పాలన రావడం ఖాయం.

## భవన నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందించిన జనసేన నాయకులు: ప్రేమ కుమార్



( జూలై - 28- హంస కలంవార్త )

ఏ.వి.బి పురం లో గత 2 వారాలుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో లేబర్ కార్డ్ మరియు ఈ-శ్రమ్ కార్డ్ నమోదు చేయించుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఇతర కార్మికులకు కూకట్ పల్లి నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎం.ఎల్.ఏ మరియు పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భముగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్షణ ఇస్తాయని అన్నారు. ప్రతి కార్మిక కుటుంబానికి జనసేన ప్రార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, ఏ.వి.బి పురం జనసైనికులు టి. ప్రసాద్ రావు, వై.దనుజయ్, బి. రాము,జి. దుర్యోదన , డి కోటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## పారడైజ్ వద్ద డ్రగ్స్ డెలివరీ భగ్నంలి



( జూలై - 28- హంస కలంవార్త )

హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఈగిల్ ఫోర్స్ తెలంగాణ, రామ్‌గోపాల్‌పేట్ పోలీసులతో కలిసి కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి సమీపంలోని పారడైజ్ సర్కిల్ వద్ద డ్రగ్స్ డెలివరీ ప్రయత్నాన్ని భగ్నం చేశారు. మెఫెడ్రోన్ డ్రగ్‌ను తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 4 గ్రాముల మెఫెడ్రోన్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్ విలువ సుమారు రూ.12 వేలుగా అధికారులు వెల్లడించారు. నగరంలో డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవడంలో ఈ ఆపరేషన్ కీలకంగా మారిందని, కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## బాలికను కాపాడిన ఆర్టీసీ డ్రైవర్ మరియు కండక్టర్

**-మనకెందుకులే అనే స్వభావం చాలామందిలో ఉంటుంది**

**-కానీ, ఒక ఆర్టీసీ బస్సు (మిధాని డిపో) కండక్టర్ (శేఖర్), డ్రైవర్ (జె.ఎస్.కుమార్) చొరవ ఒక విద్యార్థిని కాపాడింది.**

( జూలై - 28- హంస కలంవార్త )



పటాన్ చెరువులోని తెలంగాణ మైనారిటీ గురుకులం విద్యార్థిని అనూహ్యంగా పటాన్ చెరువు వద్ద ఆర్టీసీ బస్సు (నెం.218) ఎక్కింది. చేతిలో పది రూపాయల నోటు తప్ప ఆ బాలిక వద్ద ఏమి లేవు, కాళ్లకు చెప్పులు కూడా లేవు కండక్టర్ టికెట్ అడిగినప్పుడు దీనంగా అదోరీతిలో చూసింది. కండక్టర్కు అనుమానం వచ్చింది, విషయన్ని డ్రైవర్ కు చెప్పాడు, ఇద్దరూ ఆ అమ్మాయిని కనిపెడుతూనే ఉన్నారు. పక్కన ఉన్న ప్యాసింజర్ వద్ద ఫోన్ తీసుకొని ఆ అమ్మాయి ఎవరికో మాట్లాడింది

**-ఆ నెంబర్ ఆధారంగా**

ఆఅమ్మాయి మైనారిటీ గురుకులం విద్యార్థిగా నిర్ధారణ అయింది. దాంతో తోటి ప్రయాణికులకు చెప్పడంతో ఆఅమ్మాయి వెనుక నుంచి కదులుతున్న బస్సులోంచి దిగేందుకు ప్రయత్నించింది ప్రయాణికులు అందరూ ఆమెను పట్టుకొని, సముదాయించి చివరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరిగింది.

## జగద్గిరిగుట్టలో పాము కలకలం: ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోవడమే కారణం?


( జూలై - 28- హంస కలంవార్త )



జగద్గిరిగుట్ట పరిధిలోని పొలాల బస్తీ, రోడ్ నంబర్ 7 లో మంగళవారం పాము కలకలం సృష్టించింది. ఓ స్థానిక నివాసి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో, అక్కడ పెద్ద ఎత్తున ఎలుకలు, పాములు సంచరిస్తున్నాయని స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితు తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంటికి ఆనుకుని ఉన్న ఖాళీ ప్లాట్‌లో గల చెత్తాచెదారం వల్ల నిత్యం ప్రమాదకరమైన పాములు ఇంటి పరిసరాల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పెద్ద పాము సంచరించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ విషయంపై సదరు ఖాళీ స్థలం యజమానికి ఎన్నిసార్లు విన్నవించినా, చెత్తను తొలగించి స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచమని వేడుకున్నా అతను పెడచెవిన పెడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యజమాని నిర్లక్ష్యం వల్ల తమ ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి, సదరు స్థల యజమానికి నోటీసులు జారీ చేసి, ఖాళీ ప్లాట్‌లోని చెత్తను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని బస్తి వాసులు కోరుతున్నారు

# ఒకప్పుడు ప్రపంచంలో ఇన్ని భాషలు ఉండేవా?

-వేల ఏళ్ల క్రితమే ప్రపంచంలో భాషల స్వర్ణయుగం
-ఒకప్పుడు 75,000 వరకు భాషలు ఉండేవని పరిశోధనలో అంచనా
-సామ్రాజ్యాల విస్తరణతోనే భాషల క్షీణత మొదలు
-వలసవాదం ఈ క్షీణతను వేగవంతం చేసిందే తప్ప, ప్రారంభించలేదు
-ప్రస్తుతం ఉన్న భాషల్లో సగం అంతరించిపోయే ప్రమాదం




( జూలై - 28- హంస కలంవార్త )

ప్రపంచవ్యాప్తంగా ఒకప్పుడు 75 వేలకు పైగా ఉన్న భాషలు, గడిచిన కొన్ని వేల ఏళ్లలో భారీగా క్షీణించాయని ఓ నూతన అధ్యయనం వెల్లడించింది. మానవ చరిత్రలో భాషా వైవిధ్యం కొన్ని వేల సంవత్సరాల క్రితమే గరిష్ఠ స్థాయికి చేరుకుని, ఆ తర్వాత వేగంగా పతనమైందని ఈ పరిశోధన తేల్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 7,500 భాషలు వాడుకలో ఉండగా, ఇది చారిత్రక గరిష్ఠంతో పోలిస్తే చాలా తక్కువ అని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధకులు డేమియన్ బ్లాసి, క్లెయిర్ బోవెర్న్ నేతృత్వంలోని బృందం గత 12,000 సంవత్సరాల మానవ చరిత్రలో భాషల సంఖ్య ఎలా మారుతూ వచ్చిందో గణిత నమూనాల ద్వారా అంచనా వేసింది. సుమారు 12,000 ఏళ్ల క్రితం, మానవులు వేట, సేకరణ జీవన విధానంలో ఉన్నప్పుడు 4,500 నుంచి 6,200 భాషలు వాడుకలో ఉండేవని అంచనా. వ్యవసాయం ప్రారంభమై, జనాభా పెరిగి, స్థిర నివాసాలు ఏర్పడ్డాక భాషల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సుమారు 1,000 నుంచి 3,000 ఏళ్ల క్రితం భాషల స్వర్ణయుగం నడిచిందని, ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 30,000 నుంచి 75,000కు పైగా భాషలు వాడుకలో ఉండేవని ఈ నమూనాలు సూచిస్తున్నాయి. అయితే, ఈ స్వర్ణయుగం తర్వాత భాషల సంఖ్య గణనీయంగా క్షీణించడం మొదలైంది. ప్రాచీన కాలంలో పెద్ద రాష్ట్రాలు, బహుళజాతి సామ్రాజ్యాల విస్తరణే దీనికి ప్రధాన కారణమని పరిశోధకులు గుర్తించారు. ఆయా సామ్రాజ్యాలు తమ భాషలను రుద్దడంతో స్థానిక భాషలు కనుమరుగయ్యాయి. సుమారు 500 ఏళ్ల క్రితం మొదలైన యూరోపియన్ వలసవాదం ఈ క్షీణతను మరింత వేగవంతం చేసిందే తప్ప, దానికి ఆద్యం పోయలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. చాలామంది భావిస్తున్నట్టుగా వలసవాదంతోనే భాషల వినాశనం మొదలవలేదని ఈ అధ్యయనం తేల్చింది. ప్రాచీన కాలానికి సంబంధించిన రాతపూర్వక ఆధారాలు లేకపోవడంతో, పరిశోధకులు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియాలోని 171 ఆదిమ సమాజాల డేటాను విశ్లేషించి ఈ అంచనాలకు వచ్చారు. "కొన్ని వేల సంవత్సరాల క్రితం వరకు మానవత్వం చాలా విభిన్నమైన సాంస్కృతిక ప్రపంచంలో నివసించిందనే విషయాన్ని మనం అంగీకరించాలి" అని ప్రధాన పరిశోధకుడు డేమియన్ బ్లాసి అన్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న భాషల్లో సగం అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, ప్రపంచ జనాభాలో 90 శాతం మంది కేవలం 10 శాతం భాషలనే మాట్లాడుతున్నారని ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. "నేడు మనం చూస్తున్న భాషలు చరిత్రలో జరిగిన అతిపెద్ద వినాశనం నుంచి బయటపడినవి మాత్రమే. భాషల అంతర్ధానం మనం ఊహించిన దానికంటే చాలా తీవ్రంగా జరిగింది" అని సహ పరిశోధకుడు రస్సెల్ గ్రే పేర్కొన్నారు. భాషలు కేవలం సంభాషణకే కాదని, అవి సమాజాల జ్ఞానాన్ని, జ్ఞాపకాలను, సంస్కృతిని మోస్తాయని పరిశోధకులు గుర్తుచేశారు.

# పావలా శ్యామల మృతిపై పవన్ కల్యాణ్ స్పందన

-సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూత
-ఉస్మానియా ఆసుపత్రిలో గుండెపోటుతో మరణం
-పావలా శ్యామల మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్న పవన్ కల్యాణ్‌ద

( జూలై - 28- హంస కలంవార్త )



ప్రముఖ సీనియర్ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆమె మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి. ఆమె మృతిపై పవన్ కల్యాణ్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పావలా శ్యామల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. "నటి శ్రీమతి పావలా శ్యామల గారు కన్నుమూశారని తెలిసి ఎంతో చింతించాను. శ్యామల గారు రంగస్థలంపై అద్భుతమైన ప్రదర్శనలతో ప్రశంసలు అందుకుని, చిత్ర పరిశ్రమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన ఆమె అసలు పేరు నేతి శ్యామల. నాటకరంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆమె, 1985లో 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. తన నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించి నటిగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా ఖడ్గం, వర్షం, స్వర్ణకమలం, గోలీమార్, మత్తు వదలరా వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి.

# గాయత్రీ నగర్ డివిజన్‌లో ఎస్.ఐ.ఆర్ మండల ప్రవాస్ అభియాన్‌లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

( జూలై - 28- హంస కలంవార్త )



రాష్ట్ర భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ (SIR) మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని గాయత్రీ నగర్ డివిజన్ సంయోజకులుగా డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించిన రాజేశ్వరరావు పార్టీ బి.ఎల్.ఏలు మరియు బి.ఎల్.ఓలుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఓటరు గణన ఫారాల సమర్పణకు గడువు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటర్ గణన ఫారాలను సంబంధిత అధికారులకు తప్పనిసరిగా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనేక మంది ఓటర్లు ఎన్నికల సమయంలో పోలింగ్ స్టేషన్‌కు దూరంగా ఉండడం వల్ల ఓటు వేయలేకపోయిన విషయాన్ని, అలాగే పలు సమస్యలను బి.ఎల్.ఏలు రాజేశ్వరరావు దృష్టికి తీసుకురాగా, వాటిపై స్పందించిన ఆయన సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డివిజన్ సీనియర్ నాయకులు అంకిత్ సింగ్ ఠాకూర్ ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. చివరిగా సాయంత్రం డివిజన్ సీనియర్ కార్యకర్తలు, డివిజన్ కమిటీ సభ్యులు, వివిధ మోర్చాల నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశమై డివిజన్‌లో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# హైదరాబాద్ పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి!

-మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు
-మిర్యాలగూడ వద్ద ట్రేస్ చేసి అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు
-ఆరోపణలు అవాస్తవమన్న ఉదయ్ రెడ్డి.. విచారణకు సహకరిస్తానని వెల్లడి

( జూలై - 28- హంస కలంవార్త )

మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో ఆయన్ను గుర్తించిన పోలీసులు, అనంతరం హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్ శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శిక్షణ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించాడని, దాడికి పాల్పడటంతో పాటు వెంబడించి బెదిరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు తెలియకుండా ప్రైవేట్ వీడియోలు తీసి, వాటిని తన భర్తకు పంపి బ్లాక్ మెయిల్ చేశారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద లైంగిక వేధింపులు, దాడి, వెంబడించడం, అక్రమ నిర్బంధం, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు, తాను పరారీలో లేనని, అనారోగ్యంతో ఉన్న తన నానమ్మను చూసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఊళ్లపాలెం గ్రామానికి వెళ్లానని ఉదయ్ రెడ్డి మీడియాకు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవమని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు.



ఈ కేసులో నమోదైన సెక్షన్లు, లభ్యమైన ఆధారాల ప్రకారం పారదర్శకంగా దర్యాప్తు జరుపుతామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. అన్ని కోణాల్లోనూ విచారణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. కాగా, అంతర్గత విచారణలో ప్రాథమికంగా తప్పు తేలడంతో జాతీయ పోలీస్ అకాడమీ ఇప్పటికే ఉదయ్ కృష్ణారెడ్డిని శిక్షణ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

# అమరావతి అంటే ఆ 29 గ్రామాలే కాదు.. విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి: సీఎం చంద్రబాబు

-రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
-స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన
-పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం
-ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ
-ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి

( జూలై - 28- హంస కలంవార్త )



రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు నగరాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను రాజధానికి అనుసంధానంగా అభివృద్ధి చేసినప్పుడే సమగ్ర రాజధాని రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై సీఆర్డీఏ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణ పనులను 'స్పీడ్, క్వాలిటీ, డెలివరీ' లక్ష్యంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత పెరిగినప్పటికీ, అది ఏమాత్రం సరిపోదని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, కాబట్టి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణం వంటి గొప్ప అవకాశం దక్కినందుకు కాంట్రాక్టు సంస్థలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో రూ.50,999 కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, నెలకు కనీసం 7.92 శాతం చొప్పున పనులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల వంటి కీలకమైన అంశాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, ఉన్నతాధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిని ఇకపై తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. జలమయమైన రోడ్లు, స్తంభించిన ట్రాఫిక్

-హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
-పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం, స్తంభించిన ట్రాఫిక్
-మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షంద

( జూలై - 28- హంస కలంవార్త )

భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పనివేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల్లోపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు రంగంలోకి దిగి కీలక జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో హైడ్రా బృందాలు



రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేశాయి. కాగా, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కూడా నగరంలో పలుచోట్ల వర్షం కురిసింది.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
బుధవారం 29 జూలై 2026

# దాదర్ స్టేషన్‌లో 'హ్యూమన్ ఇండికేటర్'.. ప్రయాణికులకు ఓ వ్యక్తి నిస్వార్థ సేవ

-దాదర్ స్టేషన్‌లో ప్రయాణికులకు దారిచూపే నరేంద్ర పాటిల్
-'హ్యూమన్ ఇండికేటర్'గా ప్రయాణికుల ప్రశంసలు
-సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోతో వెలుగులోకి వచ్చిన సేవ
-సరైన సూచికలు లేకపోవడంతో నిస్వార్థ సేవకు శ్రీకారం

( జూలై - 28- హంస కలంవార్త )

లక్షలాది మంది ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ముంబైలోని దాదర్ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి తన నిస్వార్థ సేవలతో అందరి మన్ననలు పొందుతున్నారు. వర్లీ నివాసి అయిన నరేంద్ర పాటిల్, ప్రతిరోజూ ఉదయం రెండు గంటల పాటు స్టేషన్‌లోని వెస్టర్న్ లైన్ బ్రిడ్జిపై ఉండి, గందరగోళానికి గురయ్యే ప్రయాణికులకు రైళ్లు, ప్లాట్‌ఫామ్‌ల వివరాలను తెలియజేస్తూ మార్గదర్శనం చేస్తున్నారు. ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు ముగ్ధులైన ప్రయాణికులు ఆయన్ను ఆత్మీయంగా 'హ్యూమన్ ఇండికేటర్' (మానవ సూచిక) అని పిలుచుకుంటున్నారు. పాటిల్ ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు అత్యంత రద్దీగా ఉండే సమయంలో ఈ సేవలను అందిస్తున్నారు. విరార్ ఫాస్ట్, బోరివలీ స్లో లేదా కల్యాణ్, పన్వేల్ వైపు వెళ్లే రైళ్ల గురించి ప్రయాణికులు అడిగే సందేహాలకు ఆయన ఎంతో ఓపికగా సమాధానాలు చెబుతారు. ప్రయాణికులు ఏ భాషలో ప్రశ్నిస్తే అదే భాషలో బదులివ్వడం ఆయనలోని ప్రత్యేకత. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఈ సేవను పూర్తి చేసిన అనంతరం, ఆయన తన వృత్తిపరమైన విధులకు హాజరవుతారు. ఇటీవల 'ట్రైన్స్ ఇండియా' అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పాటిల్ సేవలకు సంబంధించిన వీడియో పోస్ట్ చేయడంతో అది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో



ఆయన చేస్తున్న గొప్ప కార్యం వెలుగులోకి వచ్చి, నెటిజన్ల నుండి ప్రశంసల వెల్లువెత్తుతున్నాయి. పలువురు ఆయన్ను 'సైలెంట్ హీరో'గా అభివర్ణిస్తున్నారు. గతంలో తనకు కూడా పాటిల్ సరైన ప్లాట్‌ఫామ్, టికెట్ ధర వంటి వివరాలు తెలిపి సహాయం చేశారని ఒక యూజర్ తన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో సరైన సూచికలు, సైన్ బోర్డులు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన పాటిల్, ఏళ్ల క్రితమే ఈ సేవకు శ్రీకారం చుట్టారు.

# ముద్రగడ నా బంధువు... రాజకీయాల కోసం వెళ్లలేదు: జ్యోతుల నెహ్రూ

-జగన్ ట్రాప్‌లలో కొందరు కూటమి నేతలు పడుతున్నారన్న జ్యోతుల నెహ్రూ
-వ్యక్తిగత అనుబంధంతోనే ముద్రగడ సంతాప సభకు వెళ్లానని వెల్లడి
-రాష్ట్రాభివృద్ధిని కోరుకునే ప్రభుత్వాలకే కాపులు అండగా నిలుస్తారన్న నెహ్రూ

( జూలై - 28- హంస కలంవార్త )

వైసీపీ అధినేత జగన్ వేస్తున్న రాజకీయ ట్రాప్‌లలో తమ కూటమికి చెందిన కొందరు నేతలు అనవసరంగా పడిపోతున్నారని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హెచ్చరించారు. తాటిపాకలో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరుకావడంపై వస్తున్న విమర్శలకు జ్యోతుల నెహ్రూ గట్టి కౌంటర్ ఇచ్చారు. "ముద్రగడ నాకు వరుసకు బంధువు, పైగా మా నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత. ఆ వ్యక్తిగత అనుబంధంతోనే నేను అక్కడికి వెళ్లాను తప్ప, ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయడానికో లేదా రాజకీయం చేయడానికో కాదు. దీనిపై జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు" అని స్పష్టం చేశారు. అలాగే, 2019లో టీడీపీ ఓటమికి కాపు ఉద్యమమే కారణమంటూ తమ పార్టీ సీనియర్ నేత బొండా ఉమా చేసిన వ్యాఖ్యలను నెహ్రూ తీవ్రంగా తప్పుబట్టారు. "ఒక్క ఘటనను మాత్రమే పట్టుకుని ఒక పెద్ద సామాజిక వర్గానికి, పార్టీ ఓటమికి ముడిపెట్టడం సరికాదు. కాపులు ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రభుత్వాలకే అండగా నిలుస్తారు. మెజారిటీ కాపు సామాజికవర్గం ఎటు ఉంటే ఆ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది" అని విశ్లేషించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాపుల



సంక్షేమానికి, వికాసానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్న జ్యోతుల నెహ్రూ... ప్రభుత్వం తరపున కాపు సామాజిక వర్గానికి చేయాల్సిన ప్రతి మేలునూ ముందుండి నడిపిస్తామని నొక్కి చెప్పారు.

# సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష.. మయన్మార్‌లో కొత్త చట్టం

-ఆన్‌లైన్ మోసాలపై మయన్మార్‌లో కఠిన చట్టం
-బలవంతపు స్కామ్‌లకు పాల్పడితే ఇకపై మరణశిక్ష
-స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు యావజ్జీవ కారాగార శిక్ష
-యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లుకు మయన్మార్ పార్లమెంట్ ఆమోదం

( జూలై - 28- హంస కలంవార్త )

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను



ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# జనసంద్రమైన సింహాచలం.. వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ

-ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
-అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
-10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
-భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
-స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ

( జూలై - 28- హంస కలంవార్త )

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా



ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

# అమెరికాలో మరో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ మహిళ దుర్మరణం

-న్యూజెర్సీ రోడ్డు ప్రమాదంలో దీపారెడ్డి అనే మహిళ మృతి
-కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో వెనకనుంచి ఢీకొన్న మరో కారు
-దీపారెడ్డిది రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామంద

( జూలై - 28- హంస కలంవార్త )

అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీపతి దీపారెడ్డి (44) దుర్మరణం చెందారు. ఆమె రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందినవారు. దీపారెడ్డి తన భర్త రామకృష్ణారెడ్డితో కలిసి న్యూజెర్సీలో నివాసముంటున్నారు. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో, వేగంగా వచ్చిన మరొక వాహనం వీరి కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపారెడ్డి ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సంతోషంగా జీవిస్తున్న కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకోవడంతో స్వగ్రామం ఆకుతోటపల్లిలోనూ, బంధువుల్లోనూ విషాదం నెలకొంది. ఈ ప్రమాదంపై న్యూజెర్సీ స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దీపారెడ్డి భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# 'ఇంటింటికి తెలుగుదేశం 2026' రెండో రోజు అప్ డేట్స్ ఇవిగో!

-రెండో రోజూ కొనసాగిన 'ఇంటింటికి తెలుగుదేశం 2026' కార్యక్రమం
-రాష్ట్రవ్యాప్తంగా 2.18 లక్షలకు పైగా ఇళ్లను ం సందర్శించిన టీడీపీ శ్రేణులు
-కుప్పంలో ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న నారా భువనేశ్వరి
-ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు
-టెక్నాలజీ సాయంతో కార్యక్రమ పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష



( జూలై - 28- హంస కలంవార్త )

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం 2026' కార్యక్రమం రెండో రోజూ రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం ఒక్కరోజే పార్టీ శ్రేణులు 2,18,619 ఇళ్లను సందర్శించాయి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాలనలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లకు గాను 1,827 క్లస్టర్లలో, 8,750 యూనిట్లకు గాను 6,680 యూనిట్లలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి సైతం ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. వరుసగా రెండో రోజు ఆమె కుప్పం నియోజకవర్గంలో పర్యటించి, స్థానిక ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, వాటి ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని ఆమె వివరించారు. ఈ కార్యక్రమ పురోగతిని తెలుగుదేశం పార్టీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటం గమనార్హం. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ అమలును సమీక్షిస్తూ, మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలను చేరవేసే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని టీడీపీ నేతలు చెబుతున్నారు.

# త్వరలో నటి మధుబాల ఇంట పెళ్లి బాజాలు

-త్వరలో తన పెద్ద కుమార్తెకు వివాహం జరగనుందని తెలిపిన మధుబాల
-ప్రస్తుతం తన కూతురు పూర్తిగా పెళ్లి పనుల్లో నిమగ్నమైందని వెల్లడి
-చిన్న కుమార్తె వ్యాపార రంగం వైపు అడుగులేస్తోందని స్పష్టం



( జూలై - 28- హంస కలంవార్త )

సీనియర్ నటి, 'రోజా' ఫేమ్ మధుబాల తన అభిమానులతో ఒక శుభవార్తను పంచుకున్నారు. తన పెద్ద కుమార్తె త్వరలోనే వివాహం చేసుకోబోతున్నట్లు ఆమె స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని తెలియజేశారు. "నా పెద్ద కుమార్తెకు త్వరలో వివాహం జరగనుంది. ప్రస్తుతం తను పూర్తిగా వివాహ వేడుక ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది. వృత్తిపరమైన విషయాల గురించి ఆలోచించకుండా, ప్రస్తుత సమయాన్ని ఆస్వాదిస్తోంది" అని మధుబాల సంతోషం వ్యక్తం చేశారు. సాధారణంగా తన వ్యక్తిగత, కుటుంబ విషయాలను గోప్యంగా ఉంచే మధుబాల, కుమార్తె పెళ్లి వార్తను స్వయంగా వెల్లడించడం విశేషం. ఇదే క్రమంలో తన చిన్న కుమార్తె కెరీర్ గురించి కూడా ఆమె ప్రస్తావించారు. మొదట్లో నటనపై ఆసక్తి చూపినప్పటికీ, ఆ తర్వాత వ్యాపార రంగం వైపు మొగ్గు చూపిందని, ప్రస్తుతం తన తండ్రి వ్యాపారంలోనే ఇంటర్న్‌గా పని చేస్తోందని వివరించారు. మధుబాల 1999లో వ్యాపారవేత్త ఆనంద్ షాను వివాహం చేసుకున్నారు. వీరికి అమేయా, కెయా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆనంద్ షా... ప్రముఖ వ్యాపారవేత్త జై మెహతాకు కజిన్ బ్రదర్. జై మెహతా అలనాటి అందాల నటి జూహీచావ్లాను పెళ్లాడిన సంగతి తెలిసిందే.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
బుధవారం 29 జూలై 2026

# బిజినెస్

## చిన్నారుల కోసం టీవీఎస్ రేస్ బైక్ 'అపాచీ ఆర్ఆర్ 200 మినీ' ఆవిష్కరణ




రేసింగ్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులను దృష్టిలో పెట్టుకుని టీవీఎస్ రేసింగ్ కొత్తగా 'అపాచీ ఆర్ఆర్ 200 మినీ'ని ఆవిష్కరించింది. 10 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులకు నియంత్రిత వాతావరణంలో మోటార్‌సైకిల్ రేసింగ్‌లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ బైక్‌ను రూపొందించింది. టీవీఎస్ అపాచీ జూనియర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ బైక్‌లను వినియోగించనున్నారు. ఇప్పటికే 10 బైక్‌లను 'మద్రాస్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ (ఎంఎంఎస్‌సీ)'కు సంస్థ అందజేసింది. 'మద్రాస్ ఇంటర్నేషనల్ కార్టింగ్' ఆవరణలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ బైక్‌లో ఆర్‌టీఆర్ 200 4వీలో ఉండే 197.75 సీసీ ఇంజిన్‌ను ప్రత్యేకంగా ట్యూన్ చేసి అమర్చారు. ఇది 9,500 ఆర్‌పీఎం వద్ద 23 పీఎస్ శక్తి, 6,500 ఆర్‌పీఎం వద్ద 20.1 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ప్రోగ్రామబుల్ టీసీఐ ఇగ్నిషన్ సిస్టమ్, రేసింగ్‌కు అనుకూలంగా రూపొందించిన ఫ్రీ ఫ్లో ఎగ్జాస్ట్‌ను అమర్చారు. కేవలం 90 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ బైక్ గరిష్ఠంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకెళుతుందని టీవీఎస్ తెలిపింది. రేసింగ్ అవసరాలకు అనుగుణంగా ఇందులో అత్యాధునిక సస్పెన్షన్, బ్రేకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ముందు భాగంలో 35 ఎంఎం అప్‌సైడ్ డౌన్ ఫోర్క్, వెనుక రేస్ షాక్ అబ్జార్బర్ ఇచ్చారు. రీబౌండ్, కంప్రెషన్, ప్రీలోడ్ సర్దుబాటు చేసుకునే సదుపాయం ఇందులో ఉంది. ముందుభాగంలో 220 ఎంఎం డిస్క్, వెనుక 180 ఎంఎం డిస్క్ బ్రేక్‌లు అమర్చారు. 12 అంగుళాల వీల్స్‌తో పాటు రేస్ కాంపౌండ్ యూరోగ్రిప్ బీఈఈ టైర్లను వినియోగించారు. ఈ బైక్‌ను యువ రేసర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించారు.

## భారత్‌లో టెస్లా జోరు- తొలి సర్వీస్ సెంటర్‌తో పాటు టెస్ట్ డ్రైవ్‌లు ప్రారంభం




భారత్‌లో తన కార్యకలాపాలను టెస్లా మరింత విస్తరిస్తోంది. అమ్మకాల తర్వాత అందించే సేవలను బలోపేతం చేసే దిశగా మహారాష్ట్రలోని పుణేలో తొలి ఆథరైజ్డ్ బాడీ షాప్‌ను ప్రారంభించింది. ఇదే సమయంలో 2026 మోడల్ 'వై' ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్, మోడల్ వై ఎల్ వాహనాలకు టెస్ట్ డ్రైవ్‌లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. పుణేలో ప్రారంభించిన ఆథరైజ్డ్ బాడీ షాప్ ద్వారా మహారాష్ట్రలోని టెస్లా వినియోగదారులకు సర్వీస్ సపోర్ట్ అందించనుంది. ఒరిజినల్ విడిభాగాలు, ప్రత్యేక శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు, టెస్లా ప్రమాణాలకు అనుగుణంగా ప్రమాదాల్లో దెబ్బతిన్న వాహనాల మరమ్మతులు, నిర్వహణ సేవలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. ఈ కేంద్రంలో బాడీ రిపేర్లు, సాఫ్ట్‌వేర్ ఆధారిత డయాగ్నస్టిక్స్, ఒరిజినల్ టెస్లా స్పేర్ పార్ట్స్‌తో మరమ్మతులు చేపడతామని పేర్కొంది. దీంతో వాహన భద్రత, పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు వినియోగదారులకు తక్కువ సమయంలోనే సేవలు అందుతాయని వివరించింది. పుణేతో పాటు సమీప ప్రాంతాల వినియోగదారుల కోసం 2026 మోడల్ 'వై' ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్, 'మోడల్ వై ఎల్' వాహనాల టెస్ట్ డ్రైవ్‌లను కూడా ప్రారంభించింది. ఆసక్తి ఉన్నవారు టెస్లా అధికారిక వెబ్‌సైట్ లేదా కస్టమర్ సపోర్ట్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని తెలిపింది. మోడల్ వై ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్ ప్రారంభ ధర రూ.50.89 లక్షలు. ఒక్కసారి పూర్తి ఛార్జింగ్‌తో గరిష్ఠంగా 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని 5.9 సెకన్లలో అందుకుంటుంది. 2,138 లీటర్ల వరకు లగేజ్ సామర్థ్యం ఉంది. ఈ మోడల్ డెలివరీలు జులై నుంచే ప్రారంభం కానున్నాయి. మరోవైపు కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడు వరుసల సీట్లు, ఆరు సీట్ల సామర్థ్యంతో మోడల్ వై ఎల్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధర రూ.61.99 లక్షలు. ఒక్కసారి ఛార్జింగ్‌తో 681 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంది. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని ఐదు సెకన్లలో చేరుకుంటుంది. 2,539 లీటర్ల వరకు లగేజ్ స్పేస్ అందుబాటులో ఉంటుంది. భారత్‌లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగానే ఈ విస్తరణ చేపట్టినట్లు టెస్లా తెలిపింది.

## టాల్కమ్ పౌడర్ కేసుల్లో మెట్టుదిగిన జాన్సన్ & జాన్సన్- సెటిల్మెంట్ కోసం వేల కోట్ల ఆఫర్




తమ టాల్క్ ఆధారిత ఉత్పత్తుల వల్ల 'అండాశయ క్యాన్సర్' బారిన పడ్డామంటూ దాఖలైన వేలాది కేసుల పరిష్కారానికి ప్రముఖ సంస్థ జాన్సన్ ఒ జాన్సన్ ఒక కీలక ముందడుగు వేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ న్యాయపోరాటానికి ముగింపు పలికేందుకు, మిగిలిన కేసులను పరిష్కరించు కోవడానికి 5.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 52,676 కోట్లు) వరకు చెల్లించేందుకు ఒక ఒప్పందాన్ని ప్రకటించింది. అయితే, ఈ సెటిల్మెంట్‌కు దాదాపు 95 శాతం మంది బాధితులు అంగీకరించాలనే కీలక షరతు విధించింది. ఈ ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం, 2027లో తొలి విడతగా 3 బిలియన్ డాలర్ల వరకు చెల్లింపులు జరపనుంది. 2028కి ముందు ఎలాంటి అదనపు చెల్లింపులు ఉండవని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికాలోని ఫెడరల్, రాష్ట్ర కోర్టులలో పెండింగ్‌లో ఉన్న టాల్క్ సంబంధిత అన్ని కేసులకు ఈ ఒప్పందం వర్తిస్తుంది. ఇదివరకే 'మీసోథెలియోమా' (meso the lioma) వ్యాధికి సంబంధించిన 95 శాతం కేసులను, ఇతర వినియోగదారుల రక్షణ క్లెయిమ్‌లను కంపెనీ పరిష్కరించుకుంది. ఈ పరిణామంపై జాన్సన్ ఒ జాన్సన్ వరల్డ్‌వైడ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ లిటిగేషన్, ఎరిక్ హాస్ మాట్లాడుతూ.. "ఈ కేసుల్లోని ఆరోపణలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని మేం ఇప్పటికీ గట్టిగా విశ్వసిస్తున్నాం. అయినప్పటికీ, ఈ సుదీర్ఘ న్యాయపోరాటానికి ముగింపు పలకాలనే ఉద్దేశంతోనే సెటిల్మెంట్‌కు అంగీకరిస్తున్నాం" అని తెలిపారు. దశాబ్దాల పరిశోధనలు, స్వతంత్ర నిపుణుల అధ్యయనాలు తమ టాల్క్ ఉత్పత్తుల భద్రతను నిర్ధారించాయని, వాటిలో ఆస్‌బెస్టాస్ లేదని, వాటి వల్ల క్యాన్సర్ రాదని కంపెనీ పునరుద్ఘాటించింది. కాగా, కంపెనీ ఇప్పటికే 2023లో ప్రపంచవ్యాప్తంగా టాల్క్ ఆధారిత జాన్సన్స్ బేబీ పౌడర్ అమ్మకాలను నిలిపివేసింది. అదే ఏడాది, తన కన్స్యూమర్ హెల్త్ వ్యాపారాన్ని 'కెన్‌వ్యూ' (ఖవఅజబవ) పేరుతో వేరు చేసినప్పటికీ, టాల్క్‌కు సంబంధించిన అన్ని చట్టపరమైన బాధ్యతలను జాన్సన్ & జాన్సన్ తనపైనే ఉంచుకుంది. నిర్దేశిత షరతులు నెరవేరితేనే ఈ సెటిల్మెంట్ ఒప్పందం అమల్లోకి వస్తుంది.

## యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్: సబలెంకాతో జతకట్టనున్న జకోవిచ్




ఇంటర్నెట్ డెస్క్:
యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఛాంపియన్‌షిప్‌లో టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్, ప్రపంచ నంబర్ 1 మహిళా ప్లేయర్ అరీనా సబలెంకా జోడీగా బరిలోకి దిగనున్నారు. వీరితో పాటు పాల్గొనే 16 జోడీల జాబితాను టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జకోవిచ్ అనుభవానికి, సబలెంకా దూకుడు ఆట జత కావడంతో ఈ జోడీ టైటిల్ ఫేవరెట్‌గా భావిస్తున్నారు. గతేడాది ప్రవేశపెట్టిన కొత్త మిక్స్‌డ్ డబుల్స్ ఫార్మాట్‌ను యూఎస్ టెన్నిస్ అసోసియేషన్ (ఖూూా) ఈసారి కూడా కొనసాగిస్తోంది. ఆగస్టు 25, 26 తేదీల్లో సింగిల్స్ ప్రధాన డ్రాకు ముందే ఈ పోటీలు నిర్వహించనున్నారు. విజేత జోడీకి 10 లక్షల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీగా అందజేయనున్నారు. జకోవిచ్, సబలెంకాతో పాటు 2025లో రన్నరప్‌గా నిలిచిన ఇగా స్వియాటెక్, కాస్పర్ రూడ్, ఎలెనా రైబాకినా–టేలర్ ఫ్రిట్జ్, నవోమి ఒసాకా–కీ నిషికోరి, జెస్సికా పెగులా–జాక్ డ్రేపర్ మరోసారి బరిలోకి దిగనున్నారు. ఆర్థర్ ఆషే స్టేడియం, లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియాల్లో అన్ని మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. కాగా జకోవిచ్, సబలెంకా కోర్టు వెలుపల కూడా మంచి స్నేహితులు. కొన్నేళ్లుగా ఇద్దరూ కలిసి సాధన చేయడం, ఒకరికి ఒకరు సలహాలు ఇచ్చుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. జకోవిచ్ అనుభవం, సబలెంకా పవర్ హిట్టింగ్ కలిస్తే ప్రత్యర్థులకు గట్టి సవాలు తప్పదని టెన్నిస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో మొత్తం ఆరు జట్లు సింగిల్స్ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా అర్హత సాధించను న్నాయి. మిగిలిన స్థానాలను వైల్డ్ కార్డులు, క్వాలిఫ యర్ల ద్వారా భర్తీ చేయనున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్లు సారా ఎర్రాని, ఆండ్రీ వవస్సోరిలు కూడా తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు పోటీలోకి రానున్నారు.

## కొడుకు కల కోసం క్యాన్సర్‌ను దాచిన తండ్రి-11 ఏళ్ల నిరీక్షణకు ఫలితం!




స్పోర్ట్స్ డెస్క్:
చాలా మంది కష్టపడుతూ అవకాశం కోసం కొంత సమయం మాత్రమే ఎదురు చూస్తుంటారు. కానీ ఇంకొందరు మాత్రం అవకాశం వచ్చే వరకు పోరాడుతూనే ఉంటారు. చివరకు అనుకున్నది సాధించి.. చరిత్రలో నిలుస్తారు. అలాంటి వారి జాబితాలో నిలుస్తాడు టీమిండియా క్రికెటర్ సరాంశ్ జైన్. దేశవాళీ క్రికెట్‌లో ఏళ్ల తరబడి నిలకడగా రాణిస్తున్న సరాంశ్‌కు తన కెరీర్‌లోనే అద్భుతమైన అవకాశం లభించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెలలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు సరాంశ్ జైన్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో అతడికి చోటు దక్కింది. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత-ఏ జట్టులో సరాంశ్ ఉన్నాడు. లంకతో జరిగిన రెండో టెస్టులో సరాంశ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆరు వికెట్లు పడగొట్టిన జైన్.. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మధ్యప్రదేశ్ సీనియర్ జట్టులో స్థానం సంపాదించినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన సరాంశ్ అన్ని విభాగాల్లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో బ్యాటర్లను కట్టడి చేస్తూ.. కీలక సమయాల్లో వికెట్లు తీస్తుంటాడు. అలానే బ్యాటింగ్‌లోనూ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటాడు. భారత్ ఎ, సెంట్రల్ జోన్ (దులీప్ ట్రోఫీ), రెస్ట్ ఆఫ్ ఇండియా (ఇరానీ ట్రోఫీ) తరఫున రాణించాడు. దీంతో బీసీసీఐ సెలక్టర్ల దృష్టిలో పడి తాజాగా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

**-క్యాన్సర్ విషయాన్ని దాచిన జైన్ తండ్రి:**

తన క్రికెట్ కెరీర్ కోసం కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో తెలిపే ఒక సంఘటనను జైన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 2014లో మధ్యప్రదేశ్ క్లబ్ తరఫున ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు జైన్ తండ్రికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందట. సరాంశ్ ఆటపైనే పూర్తిగా దృష్టి సారించడానికి అతడి తండ్రికి జరిగిన క్యాన్సర్ శస్త్రచికిత్స గురించి అప్పుడు కుటుంబసభ్యులు తెలియజేయలేదట. ఇండియాకు వచ్చిన తర్వాతే తన తండ్రి ఆరోగ్యం గురించి తెలిసిందని ఆ ఇంటర్వ్యూలో జైన్ వెల్లడించాడు.

# స్పోర్ట్స్

## శ్రీలంకతో టెస్టు సిరీస్- జట్టును ప్రకటించిన బీసీసీఐ




స్పోర్ట్స్ డెస్క్:
ఇటీవల జింబాబ్వేతో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తేడాతో భారత్ జట్టు కైవసం చేసుకుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. ఈ టెస్టు సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనున్నాడు. అలానే కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. బీసీసీఐ ప్రకటించిన జట్టులో టీమిండియా సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజాకు చోటుదక్కింది. దాదాపు ఏడాది తర్వాత జడేజా టెస్టుల్లో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. సారాన్ష్ జైన్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. మధ్యప్రదేశ్ తరఫున 131 ఫస్ట్–క్లాస్ వికెట్లు సాధించిన జైన్, ఇటీవల శ్రీలంక 'ఎ' జట్టుపై ఇండియా 'ఎ' తరఫున అద్భుత ప్రదర్శనలతో జట్టులో తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు. అలానే జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్ లను ఎంపిక చేసినప్పటికీ సిరీస్ ప్రారంభ మయ్యే సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 మధ్య గాలే వేదికగా జరగనుంది. ఆగస్టు 23 నుంచి 27 వరకు జరిగే రెండో టెస్టుకు కొలంబో వేదిక కానుంది. ఈ సిరీస్‌కు ముందు భారత జట్టు ఆగస్టు 7వ తేదీ నుంచి కొలంబోలో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

**-శ్రీలంకతో టెస్టులకు భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్

హంస కలం వార్త HAMSA KALAM VARTA
బుధవారం 29 జూలై 2026

## రిజర్వేషన్లపై ఫేక్ పోస్ట్.. తీవ్రంగా స్పందించిన శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



## ఇక పై నా ప్రయాణం సాధారణంగా ఉండదు పొలిటికల్ ఎంట్రీ పై క్లూ ఇచ్చిన హీరో విశాల్

కోలీవుడ్‌లో స్టార్ హీరోలంతా వరుసగా రాజకీయ బాట పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 'తమిళగ వెట్రి కళగం' పార్టీతో తుపాను సృష్టించిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. మరోవైపు, ఇటీవల మరో హీరో ధనుష్ చేసిన కామెంట్స్ ఆయన కూడా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారనే చర్చకు తెరలేపాయి. తాజాగా ఈ జాబితాలో మాస్ హీరో విశాల్ కూడా చేరారు. ఓ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు తమిళనాడులో తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.సినిమా రంగంలో ఇన్నాళ్లూ సంపాదించుకున్న ప్రజాదరణను, మంచి పేరును ఇకపై ప్రజాసేవ కోసం ఉపయోగించాలని భావిస్తున్నట్లు విశాల్ ప్రకటించారు. "ఇన్ని సంవత్స రాలుగా ఇండస్ట్రీలో నటుడిగా మీ నుంచి ఎంతో ప్రేమను, అభిమానాన్ని పొందాను. ఆ అభిమానానికి, ప్రేమకు ప్రతిఫలంగా మీకు తిరిగి ఏదో ఒకటి చేయాలని బలంగా నిశ్చయించుకున్నాను. ఇకపై నా ప్రయాణం గతంలో మాదిరి సాధారణంగా ఉండదు. నేరుగా, అత్యంత నిజాయతీగా ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాను. అన్ని రకాలుగా మీకు అండగా ఉంటాను" అని వ్యాఖ్యానించారు.ఇప్పటికే నడిగర్ సంగమ్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ బాధ్యతల్లో తనదైన ముద్ర వేసిన విశాల్, గతంలోనూ ఆర్‌కే నగర్ ఉపఎన్నికలో పోటీకి యత్నించిన సంగతి తెలిసిందే. రాజకీయ నాయకులు సరిగా పనిచేయనందునే కొత్త రక్తం రాజకీయాల్లోకి రావాల్సి వస్తోందని, త్వరలోనే తన రాజకీయ పయనానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని సూచించారు. ఇకపై తన అభిమాన సంఘాన్ని ప్రజా సేవ కోసం కూడా నడిపిస్తానని తెలిపారు. తన ఆలోచన వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవని... సమయం అనుకూలిస్తే ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో నిలబడతానని స్పష్టం చేశారు. విశాల్ వ్యాఖ్యలను బట్టి ఆయన త్వరలోనే సొంత పార్టీ ప్రకటన లేదా క్రియాశీల రాజకీయాల్లోకి దిగడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.




## 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్ స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది.ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



## ఓటీటీలోకి వస్తున్న సత్యదేవ్ 'రావు బహదూర్' స్ట్రీమింగ్ ఎప్పటి నుంచి అంటే..!

టాలీవుడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ కుమార్ డి దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ సోషల్ డ్రామా 'రావు బహదూర్' డిజిటల్ విడుదల తేదీ ఖరారైంది. సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది.థియేటర్లలో విడుదలైన సమయంలో ఈ సినిమా వైవిధ్యమైన కథాంశం, సత్యదేవ్ బలమైన నటన, సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందనను సొంతం చేసుకుంది. సత్యదేవ్ ప్రదర్శించిన నటన, దర్శకుడు మలిచిన ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఓటీటీలోకి వస్తుండటంతో ఈ సినిమా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కోబోతోంది




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449